# భైంసా అల్లర్లపై పత్రికా ప్రకటన

ఈనెల 10వ తేదీన భైంసాలోనూ, భైంసా మండలంలోని వటోలి గ్రామంలోనూ జరిగిన అల్లరి, హింసాకాండ గురించి మానవ హక్కుల వేదిక (HRF), ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం (APCLC), ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (OPDR)లకు చెందిన 14 మంది సభ్యులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీ ఈ దినం సంబంధిత ప్రాంతాలలో పర్యటించింది. బాధితులతో, సాక్షులతో, ఇరుగుపొరుగు ప్రజలతో, పోలీసులతో వివరంగా మాట్లాడడం జరిగింది.

సంఘటన వివరాలు తెలిసినవే కాబట్టి సమాజం ఆలోచించవలసిన కొన్ని విషయాలు ప్రజల ముందు ఉంచాలని మేము భావిస్తున్నాం. భైంసాలో మత ఘర్షణలు కొత్తకాదు. ప్రతిసారీ అల్లర్లు జరిగిన తర్వాత శాంతి గురించి, సామరస్యం గురించి, మతసహనం గురించి పెద్దలంతా మాట్లాడడం జరుగుతున్నది. ఈ మాటలలో తప్పేమీ లేదు కానీ నిత్యం ఒక పద్ధతి ప్రకారం సమాజంలో కొన్ని సంస్థలు ప్రచారం చేస్తున్న మత విద్వేషాన్నీ అసహనాన్నీ ఎక్కడికక్కడ ఎదుర్కొనే ప్రయత్నం చేయకపోతే 'హిందూ ముస్లిం భాయి భాయి' అన్న నినాదాలు చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న కథకు ఉదాహరణలుగా మిగిలిపోతాయి.

ముస్లింలలో జిహాద్ పేరుమీద ఈ విద్వేష భావన ప్రచారం అవుతున్నదని గుర్తించినంతగా హిందువులలో ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్న సంస్థలు అదేపని చేస్తున్నాయన్న గుర్తింపు రావడం లేదు. భారతదేశం హిందువులకు చెందినదనీ, అన్యమతస్తుల మనోభావాలను పట్టించుకోనవసరం లేదనీ, పట్టించుకోవాలనే ఆలోచన కుహనా లౌకికవాదం, మైనారిటీల బుజ్జగింపు అనీ ఒక విస్తృత ప్రచారం ఇండియాలో జరుగుతున్నది. దాని ప్రభావం 10వ తేదీన భైంసాలో జరిగిన ఘటనలలో కనిపిస్తున్నది. బాబ్రీమసీదును ఉద్దేశించి 'మందిర్ వహీ బనాయేంగే' అన్న పాట మసీదు దగ్గర అదేపనిగా వేయడం, స్థానిక ఎస్ఐ వద్దంటున్నా మొండిగా ఆ పని చేయడం, మసీదు దగ్గర అరగంట విన్యాసం చేసిన తరువాత ఇంక చాలు లెమ్మని పోలీసులు చెప్పినా వినకుండా ఎంతసేపయినా చేస్తాం అనడం ఈ వైఖరికి చిహ్నం. ఆ తరువాత ముస్లింలు రాళ్లు వేయడం, వీళ్ళుకూడ రాళ్ళు వేయడం, ఇరువైపులా హింసా దౌర్జన్యాలు జరగడం తెలిసిన విషయమే. పోలీసులు ఇంకొంచెం ఎక్కువ బందోబస్తుపెట్టి ఉంటే కొంచెం మెరుగుగా అదుపు చేసి ఉండవచ్చునేమో గానీ పోలీసు చర్యలే పరిష్కారం కాదు. ఈ దేశం అందరికీ చెందినదనీ, అందరూ ఒకరి భావాలనొకరు గౌరవిస్తూ కలిసి బతకాలనీ నిత్య జీవితంలో ప్రచారం కావాలి. ఆ విలువలు ప్రజల మనస్సులలో జీర్ణం కావాలి. దానికోసం అందరూ కృషి చేయాలి. దీనికి భిన్నమైన విలువలు, ఆలోచనా రీతి ఎవరు ప్రచారం చేసినా తప్పే. అయితే ముస్లింలలో ఈ తప్పు జరిగినప్పుడు సులభంగా గుర్తించి ఖండించే సమాజం హిందువులలో ఇదే జరుగుతుండడాన్ని మాత్రం సహజమైన విషయంగా భావించి ఉపేక్షించడం సరైన వైఖరి కాదు. భైంసాలో ఎంఐఎం ప్రభావాన్ని గురించి చర్చ ఉందిగానీ నిరుద్యోగులైన పేద యువకులలోని అభద్రతా భావాన్ని మైనారిటీలపట్ల ద్వేషంగా మలుస్తున్న హిందూ వాహిని కార్యక్రమాల గురించి చర్చ జరగడంలేదు.

వటోలిలో జరిగిన ఘోరమైన మారణకాండ భైంసా అల్లర్లకు కొనసాగింపుగా జరిగిందనడంలో సందేహమేం లేదు. దానికి పాల్పడిందెవరో సిబిఐ గుర్తించి సరయిన నేర విచారణ జరిపిస్తుందని ఆశిస్తాం. అయితే పైన చెప్పినట్లు ఈ దేశం భిన్న మతాల, సంస్కృతుల కలయిక అనీ, ఇది ఏ ఒక్కరికీ చెందినది కాదనీ ఒక బలమైన ప్రజాతంత్ర ఆలోచనా రీతిని ప్రజలలో, ముఖ్యంగా యువతలో కలిగించడంపైన అందరమూ దృష్టిపెట్టడం ఈ రకమైన అల్లర్లకు నిజమైన జవాబు. దానికి బదులు విద్వేష సంస్కృతిని ప్రచారం చేస్తున్నవారే పరిపాలనా వైఫల్యంమీద తప్పు పెట్టడం,పటిష్టమైన పోలీసు బందోబస్తే పరిష్కారం అనడం ఆమోదనీయం కాదు.

నిజనిర్ధారణ కమిటీ సభ్యులు :

1. మానవ హక్కుల వేదిక (HRF):

డాక్టర్ బుర్ర రాములు (రాష్ట్ర అధ్యక్షులు), కె. బాలగోపాల్ (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), ఎం.డి. అన్వర్ (కరీంనగర్ జిల్లా శాఖ కార్యదర్శి), కె. బక్కయ్య (ఆదిలాబాద్ జిల్లా కమిటీ కన్వీనర్), పి. మాధవి (హైదరాబాద్ నగర కమిటీ సభ్యురాలు), ఎం. కుమార్ (కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యుడు), పి. రాజేశం (హైకోర్టు న్యాయవాది), ఎం. రాజన్న (ఉపాధ్యాయుడు)

2. ఆం.ప్ర పౌరహక్కుల సంఘం (APCLC):

వి. సంగం (రాష్ట్ర కమిటీ సభ్యుడు), ఎ. రవీందర్ (నిజామాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి), ఎం. నాగేశ్వరరావు (నిజామాబాద్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు), ఎన్. ఈశ్వర్ (సభ్యుడు).

3. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (OPDR) :

వి. నారాయణ రెడ్డి (రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి), ఎం.డి. మహబూబ్ ఆలీ (హైదరాబాద్ నగర కమిటీ సభ్యుడు)

| | | |
|---|---|---|
| సం/- | సం/- | సం/- |
| (కె. బాలగోపాల్) | (వి. సంగం) | (వి. నారాయణరెడ్డి) |